క్లుప్తంగా

'బల్ల'కు ఆడారి అభినందనలు



లక్ష్మణరావును అభినందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, జియ్యాని శ్రీధర్ తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావును వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ బుధవారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆనంద్‌కుమార్ ఆకాంక్షించారు. అలాగే డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 58,61 వార్డుల కార్పొరేటర్లు గులిగిందల లావణ్య, కొణతాల సుధ పుష్పగుచ్ఛాలు అందజేసి లక్ష్మణరావును అభినందించారు.

పొంచి ఉన్న ముప్పు



మల్కాపురం బస్టాప్ వద్ద రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మల్కాపురం: ఆంజనేయస్వామి ఆలయ సమీపాన గత ఏడాది విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇది ప్రధాన మార్గానికి, ఆంజనేయస్వామి మందిరం, ఆర్టీసీ బస్టాప్‌కు అతి దగ్గరగా ఉండడంతో ప్రజల రాకపోకల ప్రభావం దీనిపై పడే అవకాశం ఉంది. ఇలాంటి చోట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ నుండి ఎవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా కంచె ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు గానీ, కంచె సంగతి మరిచారు. పిల్లలు, అవగాహన లేనివారు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ మహిళా నేతల నిరసన ప్రదర్శన

మల్కాపురం: ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మహిళలు, బాలికలు అదృశ్యం అవుతున్నారని పశ్చిమ టీడీపీ మహిళా అధ్యక్షురాలు లాలం లావణ్య ఆరోపించారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద తెలుగు మహిళా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె బుధవారం ఉదయం నిరసన కార్యక్రమం చేపట్టి, ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో శీరం ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

27న పురందేశ్వరి రాక

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ నెల 27న విశాఖ వస్తున్నట్లు ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతరాజ్ తెలిపారు. అధ్యక్షురాలిగా పురందేశ్వరి బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి విశాఖకు వస్తుండటంతో.. ఆమెకు స్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పదాధికారులతో సమావేశం నిర్వహించారు. పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య సమక్షంలో స్వాగత ఏర్పాట్లపై చర్చించారు. పెద్ద ఎత్తున మహిళలను సమీకరించి పురందేశ్వరికి స్వాగతం పలకాలని నిర్ణయించారు.

డెంగ్యూ, మలేరియా కట్టడికి ప్రత్యేక కార్యాచరణ

మద్దిలపాలెం: డెంగ్యూ, మలేరియా జ్వరాల కట్టడికి సచివాలయాల వారీగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని జిల్లా మలేరియా అధికారి తులసి తెలిపారు. ఇసుకతోట, మధురవాడ, పీఎం పాలెం అర్బన్ హెల్త్ సెంటర్లను బుధవారం ఆమె సందర్శించారు. ఆయా హెల్త్ సెంటర్లలో డెంగ్యూ, మలేరియా నిర్ధారణకు చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఫీవర్ సర్వేలో వలంటీర్లు గుర్తించిన జ్వరపీడితులకు సచివాలయ ఏఎన్ఎంలు తక్షణ వైద్యపరీక్షలు చేసి, తగిన వైద్యం అందించాలని సూచించారు.

జగనన్న సురక్షతో.. చేరువగా ప్రభుత్వ సేవలు

- వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆనంద్‌కుమార్
- 40వ వార్డులో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహణ



జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. బుధవారం జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో కార్పొరేటర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్త స్థాయిలో పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పేదలకు సేవలందిస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సాచురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికి మంచి చేసిన సీఎం జగన్ ప్రభుత్వం, అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా ప్రభుత్వ పథకాలు అందని వారికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని తెలిపారు. జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఇన్‌కం తదితర 11 రకాల ధ్రువీకరణ ప్రతాలను ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా అందిస్తున్నారన్నారు. అనంతరం కలిదిండి బద్రీనాథ్ మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా, లంచాలకు, వివక్షకు తావు లేకుండా వందకు వంద శాతం పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చేస్తున్న వినూత్న ప్రయత్నమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్ బోగవిల్లి నాగభూషణం, ములగాడ ఎమ్మార్వో వీరభద్రరావు, సోమాదుల సురేష్, వరపల మహేష్, నమ్మి శ్రీను, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, ఆర్పీలు, ప్రజలు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



బంటా కాలనీలో పర్యటిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటా కాలనీలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు బుధవారం పర్యటించారు. ఇక్కడి రహదారులు, కాల్వలను పరిశీలించారు. పలువురు స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. సాధ్యమైనంత తొందరలో శంకుస్థాపనలు కూడా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలోవార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, స్థానికులు కంపర సత్తిబాబు, కోటేశ్వరరావు, షేక్ వల్లి, కంచిపాటి జగదీష్, శంకరరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి జవహర్‌నగర్ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ, గుల్లలపాలెం ఎఫ్‌ఆర్‌యూ (జీవీఎంసీ ఆసుపత్రి) ఏరియా, ఎంఐజీ వుడా కాలనీ, ఎంఐజీ వుడా కాలనీ–2 ఏరియా, హనుమాన్ సంజీవ్‌కాలనీ, నెహ్రూనగర్, అశోక్‌నగర్, కొత్త నక్కవానిపాలెం పరిధి ఏరియాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షేమ పాలనతో అంతటా అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్
- 60వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

మల్కాపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిది సంక్షేమ పాలన అని, అందుకు ఉదాహరణ మన రాష్ట్రంలో నిరుపేదల సంఖ్య గణనీయంగా తగ్గి అంతటా అభివృద్ధి కనిపిస్తుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు పవన్‌పుత్రకాలనీలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో నిరుపేదలు మరింత పేదవారిగా మిగిలారని అన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. నిరుపేదల కన్నీళ్లు తుడిచే నాయకుడు మన వెంట ఉండగా, కలగూర గంప పార్టీల మాటలు దండగ అన్నారు. అనంతరం పలువురికి సంక్షేమ ఫలాల పత్రాలను అందించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు జీఎల్‌వీ నరేష్, అంగ రామ్‌ప్రసాద్, మళ్ల ధనలత, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, శరగడం పత్నిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశ అభివృద్ధి

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 888వ రోజుకు రిలే దీక్షలు



888వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్వాతంత్య్రం అనంతరం నెలకొల్పిన ప్రభుత్వరంగ సంస్థల వల్లే దేశం అభివృద్ధి పథంలో ఉందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి, కార్మికుల సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టవద్దని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 888వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు సంబంధిత సమస్యలపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల పోరాటాలు, ప్రజా ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి, విశాఖ ఉక్కు సంస్థపై పెట్టుబడి పెట్టి, పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎఫ్-5లో చెత్త నిల్వ ఉంచొద్దు

- కమిషనర్ సాయికాంత్ వర్మ



రోడ్డు విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: జోన్–5 పరిధి తాటిచెట్లపాలెం ఎంఎస్‌ఎఫ్‌లో చెత్త ఎప్పటికప్పుడు తరలించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జోన్ 3, 4, 5, 8 పరిధిలోని పాత జైల్‌రోడ్డు, జగదాంబ జంక్షన్, తాటిచెట్లపాలెం, పెందుర్తి, సుజాతనగర్, దత్ ఐలాండ్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఏ రోజు చెత్త అదే రోజు తరలించేందుకు మినీ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించారు. పాత జైల్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహ కూడలి పరిసర ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు గల అవకాశాలు, జైల్‌రోడ్డు నుంచి జగదాంబ జంక్షన్ వరకు రహదారి విస్తరణ, జంక్షన్ల అభివృద్ధికి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం 8వ జోన్ పరిధి సుజాతనగర్‌లో పర్యటించి గిరిప్రసాద్ నగర్‌లో నూతనంగా రహదారులు, జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సుజాతనగర్‌లో చెత్తను వెంటనే తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, సత్యనారాయణ రాజు, రామ్మోహనరావు, జోనల్ కమిషనర్లు ఆర్‌జీవీ కృష్ణ, మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సేఫ్టీ ఎగ్జిబిషన్ ప్రారంభం



సేఫ్టీ ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న భద్రతా విభాగాధిపతి రామ్‌ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద బుధవారం సేఫ్టీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మెసర్స్ ఉద్యోగి సేఫ్టీ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యక్తిగత రక్షణ, అత్యవసర రెస్క్యూ పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రియాలిటీ ఆధారిత శిక్షణ డెమోలు, ఎమర్జెన్సీ రెస్క్యూ డెమోలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉక్కు భద్రతా విభాగాధిపతి దువ్వాడ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పీపీఈల వినియోగాన్ని ప్రోత్సహించడానికి, తాజా రెస్క్యూ పరికరాలపై అవగాహన తీసుకువచ్చేందుకు ఈ ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుందన్నారు. భద్రతా విభాగం డీజీఎం ఎం. వరప్రసాద్, మేనేజర్ ఐ. వర్గీస్ సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, ట్రైనీలు, కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం చేయాలి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న గొందేశి సత్యారావు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకుడు గొందేశి సత్యారావు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన దీక్ష శిబిరాన్ని ఉక్కు నిర్వాసితుల సంఘం ప్రతినిధులతో కలసి బుధవారం సందర్శించారు. కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. జీతాలు పెంచమని కోరిన కార్మికులను ఉద్యోగాల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, మంత్రి శంకరనారాయణ, గొందేశి సుమన్ రెడ్డి, గంట్యాడ గురుమూర్తి, ప్రభాకర్ రెడ్డి, జగదీష్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోలో ఎస్‌ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో సీసీఎస్ ప్రతినిధులు ఎస్.వి.రమణ, బి.ఎస్.ఎన్.రాజు బుధవారం ఆరో రోజు దీక్షలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బస్సులకు స్పేర్ పార్టులు ఇప్పించాలని, అన్యాయంగా జీతం కోత విధించిన వారికి జీతాలు ఇవ్వాలని, సిక్ అయిన సందర్భంలో రోజుల తరబడి విధులకు తీసుకోకుండా వేధించే విధానం విడనాడాలని, ఓటీ, నైట్ షిఫ్ట్ అలవెన్సులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో డి.వి. సత్యవతి, ఎం.ఎం. కృష్ణ, కె.సీహెచ్. రావు, ఆర్.వి. మూర్తి కూర్చున్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో వనమహోత్సవం



మొక్క నాటుతున్న ఇంజినీరింగ్ షాప్స్ విభాగాధిపతి దుర్గాప్రసాద్



మొక్కలు నాటుతున్న సత్యసాయి సమితి ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం జన్ భాగీదారి (కమ్యూనిటీ భాగస్వామ్యం)తో వనమహోత్సవం నిర్వహించారు. దైనందిన జీవనశైలిలో పర్యావరణ అవగాహన, పచ్చదనం ప్రాముఖ్యతను పెంపొందించడానికి ఉక్కు ఆగ్రోఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో ప్రగతి మైదాన్ మెడ్‌టెక్ జోన్‌కు వెళ్లే రహదారిలో 700 కోనోకార్పస్ మొక్కలను నాటారు. అదే విధంగా సత్యసాయి సేవా సమితి, జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులు 500 మొక్కలు నాటారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు స్టీల్‌ప్లాంట్ ప్రాధాన్యం

కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పీ) విభాగంలో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న విభాగాధిపతి పి. శ్రీనివాసులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతీ ఒక్కరూ తమ పరిధిలో మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నియంత్రణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విభాగం హెచ్‌ఆర్ అధికారులు కె. తిరుమలరావు, సుబ్రహ్మణ్యం, వివిధ కార్మిక సంఘాల నాయకులు బి.ఎన్. రాజు, ఎన్నేటి రమణ, శేషగిరిరావు, పి.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో మొక్కలు నాటారు. ఉక్కు శ్రామిక సంఘం ఆధ్వర్యంలో విభాగాధిపతి కార్యాలయం వద్ద విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్, జీఎంలు పాండే, మిశ్రాలు, డీజీఎం ముఖోపాధ్యాయ మొక్కలు నాటారు. కార్యక్రమంలో విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

- శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సేవలు అభినందనీయం
- రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధి నాయుడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆత్మకూరు యశోద సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ పరిశోధన కేంద్రాన్ని బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 2019 వరకు రాష్ట్రంలో కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మాత్రమే ఉండేవన్నారు. 2019 తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో కొత్తగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టామన్నారు. అందులో ఐదు కళాశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లు కూడా ఇస్తున్నామన్నారు. దాంతో 750 సీట్లు కొత్తగా ఈ సంవత్సరం పెరుగుతున్నట్లు తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి వైఎస్సార్ కంటి వెలుగు, స్కూల్ పిల్లలకు కంటి పరీక్షలు చేయిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. గడిచిన 26 సంవత్సరాలుగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. శంకర్ ఫౌండేషన్ సేవలను గుర్తించి 2005లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నాయుడుతోటలో అత్యంత విలువైన రెండెకరాల ప్రభుత్వ భూమి కేటాయించారన్నారు. ఆ స్థలంలో యాజమాన్యం భారీ భవనాన్ని నిర్మించి, అన్ని సౌకర్యాలతో కంటి చికిత్సలు అందిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు అములులో రాష్ట్రంలోనే ఉత్తమ కంటి ఆస్పత్రిగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి పేరుగాంచడం, ప్రథమ స్థానం సంపాదించుకోవడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణ కుమార్ మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ ఆత్మకూరి శంకరరావు ఆశయాలకు అనుగుణంగా ట్రస్టీలు, డాక్టర్లు, ఉద్యోగులు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ అజయ్‌శర్మ, డాక్టర్ శిరీష, డీజీఎమ్‌లు కె.బంగార్రాజు, వి.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏయూలో మేకపాటి ధ్యాన, జ్ఞాన క్షేత్రం

- ప్రారంభమైన నిర్మాణ పనులు
- రూ.2 కోట్లు అందిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఈ క్షేత్రం నిర్మాణానికి సంబంధించి హనీ గ్రూప్‌తో మహాబోధి సొసైటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. మహాబోధి సొసైటీ ప్రతినిధి ఆర్.విజయ్‌కుమార్, హనీ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఎం.ఓబుల్ రెడ్డి ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మానవ అధ్యయన శాస్త్ర విభాగం ఆచార్యుడు పి.డి సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భవన నిర్మాణం, ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ఇందుకోసం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రూ.2 కోట్లను అందిస్తున్నారు. ఈ సందర్భంగా మహాబోధి సొసైటీ ప్రతినిధి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏయూ అందిస్తున్న సహకారం, మేకపాటి రాజమోహన్‌రెడ్డి సౌజన్యంతో విశాఖ ప్రజలకు ఉపయుక్తంగా మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, సమాజంలో శాంతిని పెంచే విధంగా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.

అనుసంధానానికి సన్నాహాలు

- విశాఖకు ఏలేరు నీటి తరలింపులో ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- ఇంజినీర్ ఇన్ చీఫ్ సతీష్‌కుమార్ వెల్లడి

నాతవరం: ఏలేరు–తాండవ అనుసంధానం పనుల కోసం.. ఏలేరు కాల్వలో నీటి సరఫరాను నిలిపి వేయడం వల్ల విశాఖ నగరానికి ఇబ్బంది లేకుండా.. ప్రత్యామ్నాయ మార్గాల కోసం అధికారులు అన్వేషిస్తున్నారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్, గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్‌కుమార్, ఉత్తర కోస్తా సీఈ ఎస్.సుగుణాకరరావు బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నాతవరం మండలం జిల్లేడుపూడిలో ఏలేరు సొరంగం వద్ద తాండవ ప్రాజెక్టు కాల్వలను వారు కాంట్రాక్టరుతో కలిసి పరిశీలించారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 22న పాదయాత్ర



ఉక్కు ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 22న రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో జింక్ గేటు నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నామని కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు తెలిపారు. 76వ వార్డు నడుపూరులోని ఉక్కు కళావేదికలో ఉక్కు నిర్వాసితులు, గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, అలాగే అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవింద్, ఏఐసీసీ మెంబర్ వేగి వెంకటేష్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, నిర్వాసిత నాయకులు పీతాని భాస్కరరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు సహకరించండి

గాజువాక: ఓటర్ల నమోదుకు, ఓటర్ల జాబితాల్లోని మార్పులు, చేర్పులకు రాజకీయ పార్టీలు సహకరించాలని గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి కోరారు. గాజువాకలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక బూత్ లెవల్ అసిస్టెంట్ (బీఎల్‌ఏ)ను నియమించాల్సి ఉందన్నారు. అయితే, ఏ పార్టీ ఇప్పటివరకు నియమించలేదన్నారు. దీనికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఫారం 1డీ బీఎల్‌ఏ1, ఫారం 1డీ బీఎల్‌ఏ 2 పత్రాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. పోలింగ్ స్టేషన్ల వారీగా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్ల పేర్లు, ఏఈఆర్‌వోల పేర్లు, ఫోన్ నంబర్ల జాబితాలను అందజేశారు.